GHMC hmda Growing Global TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణ దరఖాస్తు కొరకు సంప్రదించండి.
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers, Opp: GHMC Circle Office, Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ మిర్రర్ ®
THE
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
మంగళవారం -11-08-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్

# అవినీతిమయంగా సరూర్ నగర్ సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్




సబ్ రిజిస్ట్రార్ అండదండలతోనే సరూర్ నగర్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అవినీతి జరుగుతోందా? అంటే అవుననే వాదనలే వినిపిస్తున్నాయి. సబ్ రిజిస్ట్రార్ అండదండలు లేకుండానే కార్యాలయ సిబ్బంది అవినీతి అక్రమాలకు పాల్పడే అవకాశం ఎంత మాత్రం లేదనే స్థానికులు ఆరోపిస్తున్నారు.సరూర్ నగర్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సర్కార్ ఆదాయానికి గండి కొట్టి అధికారులు మాత్రం తమ జేబులను ఫుల్ గా నింపుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతీ రోజు సరూర్ నగర్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ఒకవైపు వ్యాపార, వాణిజ్య సముదాయాల రిజిస్ట్రేషన్, మరొకవైపు ఖాళీ ప్లాట్లను రిజిస్ట్రేషన్ కోసం పెద్ద సంఖ్యలో కొనుగోలు, అమ్మకం దారులు సందర్శిస్తుంటారు. ఇదే అదనుగా సరూర్ నగర్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది ప్రతి రిజిస్ట్రేషన్ కు రేట్ ఫిక్స్ చేసినట్లుగా వాదనలు వినిపిస్తున్నాయి.

2లో

**అవినీతి ఆగాలి... బాధ్యులు శిక్షించాలి... ప్రజల న్యాయం జరగాలి...!**

# రైతు నడ్డి విరుస్తున్న ఎరువుల దందా..!!

- ప్రభుత్వ ధర రూ.1,350... విక్రయం రూ.1,800కు?
- మహాదేవపూర్‌లో డీఏపీ అధిక ధరలపై రైతుల ఆవేదన
- నామమాత్రపు తనిఖీలతోనే అధికార యంత్రాంగం?

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** వానాకాలం సాగు ఊపందుకుంటున్న వేళ ఎరువుల ధరలు రైతులకు భారంగా మారుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో డీఏపీ ఎరువులను ప్రభుత్వ నిర్దేశిత ధర కంటే అధికంగా విక్రయిస్తున్నారనే ఆరోపణలు రైతుల నుంచి వస్తున్నాయి. 50 కిలోల డీఏపీ బస్తా ప్రభుత్వ ధర రూ.1,350గా ఉండగా, కొందరు విక్రేతలు రూ.1,800 వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో బస్తాపై దాదాపు రూ.450 అదనంగా చెల్లించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. డీఏపీ ధర రూ.1,350గా కొనసాగుతుందని కేంద్ర ప్రభుత్వం కూడా స్పష్టం చేసింది.

**సాగు పెట్టుబడులకు తోడు ఎరువుల భారం**


ఇప్పటికే విత్తనాలు, పురుగుమందులు, కూలీల ఖర్చులు, దుక్కులు, సాగునీటి ఖర్చులతో సతమతమవుతున్న రైతులకు ఎరువులపై అదనపు భారం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఒకవైపు పంటకు గిట్టుబాటు ధరపై స్పష్టత లేకపోవడం, మరోవైపు అవసరమైన సమయంలో ఎరువులు అధిక ధరలకు లభిస్తుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. తెలంగాణలోని ఇతర ప్రాంతాల్లోనూ డీఏపీ యూరియా వంటి ఎరువులను ఎంఆర్పీ కంటే అధికంగా విక్రయిస్తున్నారనే రైతుల ఫిర్యాదులు ఇటీవల నమోదయ్యాయి.

**సూరారం రైతు సాగర్ రెడ్డి ఆవేదన..**

సూరారం గ్రామానికి చెందిన రైతు సాగర్ రెడ్డి మాట్లాడుతూ... రైతు పంట పండించాలంటే ముందుగా ఎరువులు కావాలి. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఎరువు దొరకకపోతే రైతు ఎక్కడికి వెళ్లాలి? డీఏపీ బస్తా రూ.1,350 ఉండాల్సి ఉండగా రూ.1,800 వరకు అడుగుతున్నారు. ఇప్పటికే పెట్టుబడులు పెరిగిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఒక్కో బస్తాపై వందల రూపాయలు అదనంగా చెల్లించడం రైతుకు ఎంత భారమో అధికారులు అర్థం చేసుకోవాలి. రైతుల సమస్యలు తెలుసుకోవాల్సిన అధికారులు కేవలం నామమాత్రపు తనిఖీలు చేసి వెళ్లిపోతే సమస్య ఎలా పరిష్కారం అవుతుంది? నిజంగా తనిఖీలు చేస్తే అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నారా లేదా అన్నది బయటపడుతుంది. రైతులపై భారం పడకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి” అని సాగర్ రెడ్డి కోరారు.

**తనిఖీలు ఎక్కడ? చర్యలు ఎక్కడ?**

ఎరువుల విక్రయ కేంద్రాల్లో ధరల పట్టికలు స్పష్టంగా ప్రదర్శిస్తున్నారా? రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇస్తున్నారా? ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్పీ కంటే అధికంగా వసూలు చేస్తున్నారా? అనే అంశాలపై వ్యవసాయ శాఖ అధికారులు




పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు. అధిక ధరలకు ఎరువు విక్రయిస్తున్నట్లు తేలితే సంబంధిత వ్యాపారులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, అవసరమైతే లైసెన్సులపై కూడా చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**రైతు కోసం ఉన్న అధికారులు... రైతు పక్షాన నిలుస్తారా?**

ఎరువుల ధరలపై రైతుల నుంచి వస్తున్న ఆరోపణలు నిజమా? కాదా? అనేది వ్యవసాయ శాఖ అధికారులు స్పష్టంచేయాల్సి ఉంది. కేవలం కాగితాలపై తనిఖీలు కాకుండా క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వాస్తవాలను బయటపెట్టాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఎరువులు అందాల్సిన చోట రైతుల నుంచి అదనపు ధర ఎందుకు వసూలు చేస్తున్నారు? అధికారులకు ఈ విషయం తెలియదా? తెలిసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? అనే ప్రశ్నలు ప్రస్తుతం మహాదేవపూర్ మండల రైతుల నుంచి వినిపిస్తున్నాయి. రైతు చెమటతో పంట పండుతుంది... ఆ పంటపై వ్యాపారం చేసే హక్కు ఉంది కానీ రైతు నష్టపోయేలా దోపిడీ చేసే హక్కు ఎవరికీ లేదని రైతులు స్పష్టం

# పేదల జోలికొస్తే ఖబడ్దార్

**గండిపేట, క్రైమ్ మిర్రర్:** రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రాంతంలో కొన్ని దశాబ్దాలుగా నివసిస్తున్న 300 పేద కుటుంబాలకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అండగా నిలిచారు. తమ భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న రియల్ ఎస్టేట్ మాఫియా మరియు వారికి వత్తాసు పలుకుతున్న పోలీసుల తీరుపై మల్లన్న తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బాధితులకు ధైర్యం చెబుతూ, వారి హక్కుల కోసం తాను ఎందాకైనా వెళ్లడానికి వెనుకాడబోనని స్పష్టం చేశారు. సివిల్ వివాదాల్లో పోలీసులు జోక్యం చేసుకోవద్దని అత్యున్నత న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని మల్లన్న గుర్తు చేశారు. అయినప్పటికీ, రాజేంద్రనగర్ పోలీసులు రియల్ ఎస్టేట్ మాఫియా మరియు పక్కనే ఉన్న విల్లా యజమానుల దగ్గర లంచాలు తీసుకుని, గుండాలతో జతకట్టి పేదలను వేధిస్తున్నారని మండిపడ్డారు. పోలీసులే గుండాలను పెట్టి ప్రజలను కొట్టడం, ఇళ్ల నుంచి తరిమేయడం వంటి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కోర్టు తీర్పును ధిక్కరించి పోలీసులు భూముల్లోకి వస్తే, వారి పేర్లను వీడియో తీసి పెట్టాలని, స్వయంగా తానే వారిపై హైకోర్టులో కేసులు వేయిస్తానని హెచ్చరించారు. ప్రజలను పోలీస్ స్టేషన్‌కు పిలిచి రాజీ పడాలని ఒత్తిడి చేసే అధికారులను రేపు దోషులుగా బోనులో నిలబెడతామని స్పష్టం చేశారు. బాధితులతో ముఖాముఖి మాట్లాడిన మల్లన్న, బాధితుల భూమిలో నుంచి ఇంచు భూమి కూడా పోనివ్వనని, కొండంత అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పోలీసులు లేదా గుండాలు అర్ధరాత్రి వేళ వచ్చినా సరే, ఒక్క ఫోన్ కాల్ చేస్తే తాను రాత్రి 2 గంటలకైనా నేరుగా అక్కడికి చేరుకుంటానని హామీ ఇచ్చారు.

# అవినీతిమయంగా సరూర్ నగర్ సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్

సాధారణ రిజిస్ట్రేషన్ అయితే ఒక రేటు, నిబంధనలోని లొసుగులను ఆధారంగా చేసుకుని రిజిస్ట్రేషన్ తంతు పూర్తి చేస్తే మరొక రేటు ఫిక్స్ చేశారని టాక్ వినిపిస్తోంది. సరూర్ నగర్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం లో 131 జీవో భిన్నంగా ఎల్ ఆర్ ఎస్ లో క్రమబద్ధీకరించని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసినందుకు భారీ మొత్తంలో కార్యాలయ సిబ్బంది ముడుపులు దండుకున్నట్లుగా తెలుస్తోంది. అలాగే వాణిజ్య భవనాలను సైతం రెసిడెన్షియల్ భవనాలుగా చూపిస్తూ రిజిస్ట్రేషన్ చేయడం ద్వారా కూడా కార్యాలయ సిబ్బంది తమ చేతి వాటాన్ని ప్రదర్శించారన్న ఆరోపణలు లేకపోలేదు. సరూర్ నగర్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం లో ప్రతిరోజు లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయని, ఇందులో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది వాటా ఎంత? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది అవినీతికి దన్నుగా నిలుస్తోంది ఎవరన్న ప్రశ్నకు సమాధానం లేకుండా పోయింది. సరూర్ నగర్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది

**అవినీతి అక్రమాలపై పూర్తి ఆధారాలతో సమగ్ర వార్తా కథనం రేపటి సంచికలో...**

# సమస్యలపై నిరంతరం పోరాడుతాం

**టిడబ్ల్యూజెఎఫ్ కార్యదర్శి కొత్తకొండ సత్యం**

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 09:** జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్లకు అతీతంగా నిరంతరం పోరాడతామని పటాన్‌చెరు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్) డివిజన్ కార్యదర్శి కొత్తకొండ సత్యం అన్నారు. ఇటీవల నిర్వహించిన పటాన్‌చెరు టిడబ్ల్యూజెఎఫ్ మూడో మహాసభలో కార్యదర్శిగా మరోసారి ఎన్నికైన సందర్భంగా సోమవారం జిన్నారం మున్సిపల్ కేంద్రంలో సీనియర్ జర్నలిస్టులు సత్యంను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ.. తనపై అభిమానంతో సన్మానించిన జర్నలిస్టులకు పటాన్‌చెరు టిడబ్ల్యూజెఎఫ్ డివిజన్ కమిటీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శేఖర్ గౌడ్, మహేష్ గౌడ్, విజయ్, జింకల శ్రీనివాస్, మున్నీ శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి జూపల్లికి జన్మదిన వేడుకలు తెలిపిన మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్



**వనపర్తి ఆగస్టు 10 క్రైమ్ మిర్రర్:** రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జన్మదినాన్ని పురస్కరించుకుని పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం పెబ్బేరు గెస్ట్ హౌస్‌లో మంత్రిని కలిసి, శాలువాతో సత్కరించి పూలబోకే అందించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సంతోషంగా జీవించాలని, నిరంతరం ప్రజాసేవలో ముందుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ రామన్ గౌడ్, మాజీ సర్పంచులు వెంకటేష్ సాగర్, సురేందర్ గౌడ్, బుర్రమోని రాములు యాదవ్, రణధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తొలి జీతం.. పారిశుద్ధ్య కార్మికుడికి బహుమానం

**జోగు లక్ష్మయ్య ను సన్మానించడం కౌన్సిలర్ అస్మిత చంద్రకాంత్ రెడ్డి**



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని 15 వ వార్డు పరిశుభ్రత కోసం నిరంతరం సేవలందిస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుడు జోగు లక్ష్మయ్య ను అవార్డు కౌన్సిలర్ అస్మిత చంద్రకాంత్ రెడ్డి సోమవారం ఘనంగా సన్మానించారు. వార్డు పరిశుభ్రత, పారిశుద్ధ్య పరిరక్షణలో ప్రతిరోజూ కష్టపడి పనిచేస్తూ ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా తమ మొదటి నెల జీతాన్ని బహుమతిగా అందజేసి, జోగు లక్ష్మయ్య సేవలను కొనియాడారు. ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని, ఎలాంటి పరిస్థితుల్లోనైనా వార్డు పరిశుభ్రత కోసం వారు చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. సమాజం కోసం నిస్వార్థంగా పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, వారి సేవలను గుర్తించి ప్రోత్సహించడం మరింత మంది సేవా కార్యక్రమాల వైపు అడుగులు వేసేందుకు స్ఫూర్తినిస్తుందని తెలిపారు. జోగు లక్ష్మయ్యను సన్మానించి, మొదటి నెల జీతాన్ని బహుమతిగా అందించడం ద్వారా పారిశుద్ధ్య కార్మికుల పట్ల గౌరవం, కృతజ్ఞతను చాటుకున్నారు.



# కేంద్ర బీజేపీ కార్పొరేట్--మతతత్వ విధానాలను వ్యతిరేకిస్తూ జైల్‌భరో విజయవంతం

**అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు, సంయుక్త కిసాన్ మోర్చా, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జైల్‌భరో కార్యక్రమం**

**ఖమ్మంలో భారీ ప్రదర్శన -- ఇల్లందు క్రాస్‌రోడ్‌లో రాస్తారోకో**



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతతత్వ, ప్రజా--కార్మిక--కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా నిర్వహించిన జైల్‌భరో కార్యక్రమంలో భాగంగా ఖమ్మం జిల్లాలో అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు, సంయుక్త కిసాన్ మోర్చా, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జైల్‌భరో కార్యక్రమం విజయవంతమైంది. జైల్‌భరో సందర్భంగా పరిషత్ సెంటర్ నుంచి టూ టౌన్ పోలీస్ స్టేషన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఇల్లందు క్రాస్‌రోడ్‌లో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు పలువురు నాయకులను అరెస్టు చేయగా, కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు స్వచ్ఛందంగా అరెస్టులకు సిద్ధమై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సీపీఎం రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు, సీపీఐ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు , సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు, మాజీ శాసనసభ్యులు గుమ్మడి నర్సయ్య, బీ.ఆర్.ఎస్ నాయకులు, మాజీ శాసనసభ్యురాలు బానోత్ చంద్రావతి మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం నయా ఉదారవాద సంస్కరణలను దూకుడుగా అమలు చేస్తూ కార్మికులు, రైతులు, సామాన్య ప్రజల హక్కులను హరిస్తోందని విమర్శించారు.

### నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించాలి

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లుగా మార్చారని వారు తెలిపారు. రోజువారీ పని సమయాన్ని 8 గంటల నుంచి 12 గంటలకు పెంచుకునే అవకాశం యాజమాన్యాలకు కల్పించడం, సమ్మె హక్కుపై ఆంక్షలు విధించడం, కార్మిక సంఘాల గుర్తింపు--రిజిస్ట్రేషన్‌ను కష్టతరం చేయడం, ఉద్యోగ భద్రతను దెబ్బతీయడం వంటి చర్యలు కార్మిక వ్యతిరేకమైనవని అన్నారు. 300 మంది లోపు కార్మికులు పనిచేసే సంస్థల్లో నోటీసు లేకుండా కార్మికులను తొలగించే 'హైర్ అండ్ ఫైర్' విధానాన్ని అమలు చేయడం తీవ్ర అన్యాయమన్నారు. నాలుగు లేబర్ కోడ్లను పూర్తిగా ఉపసంహరించుకునే వరకు కార్మికవర్గం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

### రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

కేంద్ర ప్రభుత్వం అమెరికా, బ్రిటన్, న్యూజిలాండ్ తదితర దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకోవడం వల్ల దేశీయ వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. దిగుమతులను ప్రోత్సహించడం, తక్కువ లేదా సున్నా సుంకాలతో వ్యవసాయ ఉత్పత్తులు దేశంలోకి రావడం వల్ల దేశీయ రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని పేర్కొన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల వ్యయంపై 50 శాతం కలిపి కనీస మద్దతు ధర నిర్ణయిస్తామని ఇచ్చిన హామీని కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, రైతుల రుణాలను మాఫీ చేయాలని, పంటలకు గిట్టుబాటు ధరలు, పంట రుణాలు, ప్రకృతి వైపరీత్యాల నష్టపరిహారం, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

### ఉపాధి హామీ పథకాన్ని కాపాడాలి

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన పేరును మార్చడంతో పాటు రాష్ట్రాల వాటాను భారీగా పెంచే చర్యలు చేపట్టడం ద్వారా ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరుస్తున్నారని విమర్శించారు. సమైక్య పోరాటాల ద్వారా ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అంత్యోదయ పథకం కింద నిరుపేద కుటుంబాలకు ప్రస్తుతం అందుతున్న 35 కిలోల బియ్యం విధానాన్ని మార్చి వ్యక్తికి 7 కిలోల చొప్పున ఇవ్వాలని ప్రతిపాదించడం పేదలపై భారాన్ని మోపడమేనన్నారు. ఈ సవరణలను ఉపసంహరించుకుని ప్రతి నిరుపేద కుటుంబానికి 35 కిలోల బియ్యాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

### విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించాలి

2025 విద్యుత్ సవరణ బిల్లు ద్వారా విద్యుత్ రంగంలో రాష్ట్రాల హక్కులను హరించే ప్రయత్నం జరుగుతోందని నాయకులు విమర్శించారు. విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీ రంగాలను కేంద్రీకరించడం, స్మార్ట్ మీటర్ల పేరుతో ముందస్తు చార్జీలు వసూలు చేయడం, ఉచిత విద్యుత్‌కు ముప్పు కలిగించడం, క్రాస్ సబ్సిడీని రద్దు చేయడం వంటి చర్యలు సామాన్య వినియోగదారులపై తీవ్ర భారం మోపుతాయని అన్నారు. తెలంగాణలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా కొనసాగుతున్నప్పటికీ, భవిష్యత్తులో వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేయడం లేదా విద్యుత్ చార్జీలు విధించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ రంగాన్ని క్రమంగా ప్రైవేటీకరించే చర్యలను అడ్డుకోవాలని, వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళ్యాణం వెంకటేశ్వరరావు, తుమ్మ విష్ణువర్ధన్, సి.వై. పుల్లయ్య, జి. రామయ్య, సింగు నరసింహారావు, తోట రామాంజనేయులు, యర్రా శ్రీనివాస్, మెరుగు సత్యనారాయణ, బోంతు రాంబాబు, మాదినేని రమేష్, వై. విక్రమ్, గోవిందరావు, వెంకన్న, నరాల నరేష్, ఆవుల అశోక్, పాషా, లక్ష్మీనారాయణ, మహిళా సంఘాల నాయకులు శిరోమణి, బండి పద్మ, పి. రమ్య తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ కొలువులే లక్ష్యంగా.. కల్వకుర్తి యువతకు ఉచిత శిక్షణ

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** నియోజకవర్గ గ్రామీణ ప్రాంత యువత పోలీస్ ఉద్యోగాలు సాధించాలనే కలకు చేయూత అందించేందుకు ఐక్యత ఫౌండేషన్ మరో ముందడుగు వేసింది. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత ఎస్సై, కానిస్టేబుల్ శిక్షణలో మొదటి బ్యాచ్ విజయవంతంగా పూర్తి కాగా, రెండో బ్యాచ్‌కు శ్రీకారం చుట్టనున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల యువతకు అందుబాటులో ఉండేలా నిర్వహిస్తున్న ఈ శిక్షణ ఆగస్టు 16వ తేదీ ఆదివారం నుంచి కల్వకుర్తిలో ప్రారంభం కానుంది. ఓల్డ్ కృష్ణవేణి జూనియర్ కాలేజ్ బిల్డింగ్, వీ=హా కార్యాలయం ఎదురుగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. మొదటి బ్యాచ్‌ను విజయవంతంగా పూర్తి చేసిన అనుభవంతో రెండో బ్యాచ్‌లో మరింత మెరుగైన ప్రణాళిక, నాణ్యమైన బోధన, నిరంతర పరీక్షలతో అభ్యర్థులను పోలీస్ ఉద్యోగాల పోటీ పరీక్షలకు సిద్ధం చేయనున్నారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఉన్న నియోజకవర్గ యువత ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పట్టుదలతో చదివి తమ లక్ష్యాలను సాధించాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. https://forms.gle/XNKBa7A2kmiDDqqT6 లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. సందేహాల కోసం6300553467 నంబర్కు సంప్రదించాలని సూచించారు.

# వామపక్షాలు, ప్రజాసంఘాల జైలుబరో విజయవంతం

**ఖమ్మం కోదాడ ప్రధాన రహదారిపై రాస్తారోకో**

**మోడీ... డౌన్ డౌన్... నినదించిన కార్మిక, కర్షక, ప్రజా సంఘాలు**

**భారీగా నిలిచిన వాహనాలు**



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, వ్యవసాయ కూలీలు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం తెలంగాణ రైతు సంఘం, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, ఏఐటీయూసీ, సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఇతర ప్రజా సంఘం ఆధ్వర్యంలో నేలకొండపల్లి మండల కేంద్రంలో పొట్టి శ్రీరాములు సెంటర్లో ఖమ్మం కోదాడ ప్రధాన రహదారిపై చేపట్టిన జైలుబరో కార్యక్రమం సంపూర్ణంగా విజయవంతమైంది. తొలుత ఆయా ప్రజా సంఘాలు పార్టీల కార్యాలయాలనుండి కార్యకర్తలు వివిధ ప్రజా సంఘాల శ్రేణులు భారీ ప్రదర్శనగా బయలుదేరి నేలకొండపల్లి పొట్టి శ్రీరాములు సెంటర్ కు చేరుకున్నారు. వందలాదిగా కదిలి వచ్చిన ప్రజలు ప్రధాన రహదారిపై ధర్నా రాస్తారోకో నిర్వహించారు. మోడీ విధానాలను నిరసిస్తూ పెద్ద ఎత్తున నినదించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను, చట్టాలను తక్షణమే వెనక్కి తీసుకోవాలి ప్రధాని మోడీ... డౌన్ డౌన్ అంటూ గర్జించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ(ఎం) జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కెవి రామిరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో మూడవసారి అధికారం చేపట్టిన బిజెపి ప్రభుత్వం కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను మరింత వేగంగా అమలు చేస్తుందని విమర్శించారు. ఎందరో పోరాట యోధులు తమ ప్రాణ త్యాగాలతో సాధించుకున్న దేశ స్వేచ్ఛ స్వాతంత్ర్యాలను విదేశీ సంస్థలకు తాకట్టు పెడుతున్నారని మండిపడ్డారు. కార్పొరేట్ పెట్టుబడుదారులకు దేశ సంపదను అప్పనంగా దోచిపెడుతూ ప్రజలపై హారాలు మోపుతున్నారన్నారు. ప్రభుత్వ అసమర్థ విధానాలను నిరసిస్తూ క్విట్ ఇండియా స్ఫూర్తితో వివిధ ప్రజా సంఘాలు, వామపక్షాలఆధ్వర్యంలో చేపట్టిన జైలుబరో కార్యక్రమంలో వందలాదిగా ప్రజలు పాల్గొనడం అభినందనీయమన్నారు.అధికార బిజెపి ప్రభుత్వం కార్మిక లోకం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోళు ్లగా మార్చి కార్మికుల జీవితాలను విచ్ఛిన్నం చేసిందన్నారు. ఫలితంగా పనిగంటల పెంపు భారంతో పాటు ఉద్యోగ భద్రత లేకుండా కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సంస్కరణ పేరుతో వ్యవసాయ రంగాన్ని దివాలా తీసే విధంగా చట్టాలను తీసుకురావడం వ్యవసాయం నుండి రైతును వేరు చేయడమేనన్నారు. గ్రామీణ ప్రాంతంలో పనిచేస్తున్న వ్యవసాయ కూలీలకు ఉపాధి భద్రత కోసం తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని విబిజి రాంజీగా పేరు మార్చి పేదల పొట్టలు కొట్టే కుట్ర చేసిందని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను, చట్టాలను తక్షణమే వ్యవసాయ కూలీలకు పని భద్రత కల్పించాలని, రైతాంగానికి స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు సరైన మద్దతు ధరలు చెల్లించాలని, కార్మికులకు కనీస వేతనం 42 వేల రూపాయలు ఇవ్వాలని స్కీం వర్కర్లకు కార్మికులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసే ఆలోచన మానుకోవాలని డిమాండ్ చేశారు. లేని యెడల రానున్న కాలంలో ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, ఎంఎల్ పార్టీ మండల నాయకులు చిర్రా బిక్షం, పగిడికత్తుల రామదాసు పాల్గొని ప్రసంగించారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై శ్రీనివాసరెడ్డి సిబ్బందితో అక్కడకు చేరుకొని ప్రజా సంఘాలు, వామపక్షాల నాయకులను అరెస్టు చేసి స్టేషన్కు తరలించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి రచ్చ నరసింహారావు, అధ్యక్షుడు ఇంటూరి అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు దుగ్గి నరసింహారావు, కార్యదర్శి పెద్దపాక మల్లేశ్వరరావు, మహిళా సంఘం జిల్లా నాయకురాలు బెల్లం లక్ష్మి, మండల అధ్యక్షురాలు బలుసు ప్రమీల, నాయకులు దుగ్గి వెంకటేశ్వర్లు ఏటుకూరి రామారావు, రావెళ్ల సుదర్శన్ రావు, భూక్య కృష్ణ, ఎడ్ల తిరపారావు, మందడపు మురళీకృష్ణ, దండా సూర్యనారాయణ, దేగల వెంకటేశ్వరరావు, మారుతి కొండలరావు, పెద్దిరాజు నరసయ్య, ఎలమద్ది లెనిన్, కాల్వ కోటేశ్వరరావు, గాదె వెంకటేశ్వర్లు, అంగన్వాడి యూనియన్ జిల్లా నాయకురాలు కోటేశ్వరి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు జ్యోతి, విజయకుమారి, సుజాత, శారద, అయోధ్య ఉపేందర్ దేగల హరిప్రసాద్, గురజాల ఉపేందర్, నున్న మధుసూదన్ రావు, సామల మల్లికార్జునరావు, పుణ్యవతి, తదితరులు పాల్గొన్నారు.

# వీరనాగమ్మ ఆలయ అభివృద్ధికి రూ.1.80 లక్షల సహకారం

**మండల పూజలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** మాడుగుల మండలం దొడ్లపహాడ్ గ్రామంలో నూతనంగా విగ్రహ ప్రతిష్ఠాపన పూర్తి చేసుకున్న వీరనాగమ్మ దేవత ఆలయంలో 41 రోజుల పూజా కార్యక్రమాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన మండల పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని వీరనాగమ్మ దేవతను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారంగా రూ.1,80,000ల వ్యయంతో పెయింటింగ్ పనులు పూర్తి చేయించారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తున్న వీరనాగమ్మ దేవత ఆలయ అభివృద్ధికి సహకరించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లోని ఆలయాలు ప్రజల విశ్వాసాలు, సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఆలయాల అభివృద్ధి కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా గ్రామ ప్రజలందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఐక్యతను పెంపొందించేందుకు దోహదపడుతుందని తెలిపారు. వీరనాగమ్మ దేవత ఆలయంలో నిర్వహించిన మండల పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. దొడ్లపహాడ్ గ్రామ ప్రజలపై వీరనాగమ్మ దేవత అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధికి రూ.1.80 లక్షలతో పెయింటింగ్ పనులు పూర్తి చేసి సహకారం అందించినందుకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు రాఘవేందర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మట్ట నాగయ్య, మట్ట యాదయ్య, అర్జున్, మల్లేష్, శ్రీను, శంకర్, రాజు, నాగరాజు, వెంకటేష్, సురేష్, సత్తయ్య, యాదగిరి, నాగేష్ తదితరులతో పాటు గ్రామ పెద్దలు, భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# తల్లీ, ఇద్దరు పిల్లలు అదృశ్యం

**క్రైమ్ మిర్రర్,ఎల్బీనగర్, ఆగస్టు 10:** కుటుంబ కలహాల నేపథ్యంలో తల్లీ, ఇద్దరు చిన్నారులు అదృశ్యమైన ఘటన హయత్నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పలిపట్టు సునీల్‌కుమార్‌కు సుమారు ఐదేళ్ల క్రితం మల్లీశ్వరి అలియాస్ మౌనిక (22)తో వివాహం జరిగింది. వీరికి జ్ఞాన్సిక్, గీతాన్సిక అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. సునీల్‌కుమార్ చైతన్యపురిలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తూ, అప్పుడప్పుడు లారీ డ్రైవర్‌గా కూడా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 6న మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో కుటుంబ విషయమై భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. అనంతరం సునీల్‌కుమార్ లారీ డ్రైవింగ్‌కు వెళ్లిపోయాడు. ఈ క్రమంలో 9వ తేదీ ఉదయం సుమారు 5 గంటలకు రావి నారాయణరెడ్డి కాలనీలోని ఇంటికి తిరిగి వచ్చాడు. అయితే ఇంట్లో భార్య మల్లీశ్వరి అలియాస్ మౌనికతో పాటు పిల్లలు జ్ఞాన్సిక్, గీతాన్సిక కనిపించలేదు. మల్లీశ్వరి వద్ద మొబైల్ ఫోన్ కూడా లేదని సునీల్‌కుమార్ తెలిపారు.బంధువులు, చుట్టుపక్కల వారిని విచారించినప్పటికీ వారి ఆచూకీ లభించకపోవడంతో సునీల్‌కుమార్ పోలీసులను ఆశ్రయించాడు. తన భార్య, ఇద్దరు పిల్లలను గుర్తించి ఇంటికి తీసుకురావడంలో సహాయం చేయాలని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి వారి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు.

# దుర్గం చెరువులో గుర్తుతెలియని మహిళ మృతదేహం.....



**మాదాపూర్ క్రైమ్ మిర్రర్ :** దుర్గం చెరువులో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శనివారం సాయంత్రం సుమారు 7.30 గంటల సమయంలో చెరువులో మహిళ మృతదేహం నీటిపై తేలుతూ ఉన్నట్లు లేక్ పీసీ శ్రీశైలం పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే బ్లూకోల్ట్స్ సిబ్బంది, సబ్ ఇన్స్పెక్టర్ ఘటనాస్థలానికి చేరుకున్నారు. హెచ్చైడ్రా సిబ్బంది సహాయంతో నీటిలో నుంచి మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు.. మృతురాలి వయసు సుమారు 20 నుంచి 25 సంవత్సరాల మధ్య ఉండవచ్చని అంచనా వేశారు. మృతురాలు ఎరుపు రంగు లెగ్గింగ్స్, తెల్లటి చుక్కలతో కూడిన నీలం రంగు టాప్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆమెకు సంబంధించిన ఎలాంటి గుర్తింపు వివరాలు లభించక పోవడంతో ఆచూకీ కోసం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# సాగర్ ఎక్స్ రోడ్స్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



**క్రైమ్ మిర్రర్,ఎల్బీనగర్, ఆగస్టు 10:** సాగర్ ఎక్స్ రోడ్స్ వద్ద సుమారు 55 నుంచి 60 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన ఎల్బీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్బీ నగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ ఎన్. మహేష్, మరో పోలీస్ సిబ్బందితో కలిసి బి సి డ్యూటీలో భాగంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం సుమారు 8:40 గంటలకు సాగర్ ఎక్స్ రోడ్స్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందింది. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గుర్తించారు.మృతుడు నలుపు రంగు రౌండ్ నెక్ హాఫ్ స్లీవ్స్ టీ-షర్ట్, చెక్స్ డిజైన్ ట్రాక్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. అతను భిక్షాటన చేసుకునే వ్యక్తిగా పోలీసులు అనుమానిస్తున్నారు. స్థానికులను విచారించగా, సదరు వ్యక్తి గత కొన్ని రోజులుగా ఫ్లైఓవర్ కింద ఉంటూ భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్నట్లు తెలిసింది.మృతదేహాన్ని పోస్టుమార్టం పరీక్ష నిమిత్తం ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నం. 1064/2026, సెక్షన్ 194 దీచీూా కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు..

# లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

**సింగరేణి జీఎం కార్యాలయం ఎదుట నాలుగు జాతీయ సంఘాల ధర్నా**

**మందమర్రి, ఆగస్టు 10 (క్రైమ్ మిర్రర్):** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని,కార్మిక హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం మందమర్రి సింగరేణి డివిజన్ జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట నాలుగు జాతీయ కార్మిక సంఘాలు ధర్నా నిర్వహించాయి. అనంతరం జీఎం ఎన్.రాధాకృష్ణకు జేఏసీ నాయకులు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ ఉపాధ్యక్షుడు భూపాల్ మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌ల పేరుతో కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం హరిస్తోందని ఆరోపించారు. పరిశ్రమలను ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.11వ వేతన ఒప్పందం కాలపరిమితి ముగిసినా 12వ వేతన ఒప్పందం ఏర్పాటు చేయకపోవడం కార్మికుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.సింగరేణిలో కొత్త గనులు ప్రారంభించి ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సి ఉండగా బొగ్గు గనులను పెద్ద పెట్టుబడిదారులకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని నాయకులు విమర్శించారు. కార్మికుల పేర్ల మార్పులు, ఓవర్‌మెన్‌ల పదోన్నతులు, కనీస వేతనాల అమలు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు జాతీయ కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాటాలు కొనసాగిస్తాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నుంచి కాంపల్లి సమ్మయ్య, ఏఐటీయూసీ నుంచి సలేంద్ర సత్యనారాయణ, సీఐటీయూ నుంచి సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ అల్లి రాజేందర్, హెచ్ఎంఎస్ నుంచి పార్వతి రాజిరెడ్డి, పలువురు కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొని యువకుడి మృతి



**క్రైమ్ మిర్రర్,ఎల్బీనగర్, ఆగస్టు 10:** వేగంగా, నిర్లక్ష్యంగా నడిపిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన ఎల్.బి. నగర్ కోర్టు సమీపంలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫ్‌నగర్ అంజుమన్‌కు చెందిన సయ్యద్ తౌఫిక్ ఉద్దీన్ (23) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో తన స్నేహితుడు సయ్యద్ అయాన్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై ఆసిఫ్‌నగర్ నుంచి ఆటోనగర్ వైపు వెళ్తున్నాడు. ఎల్.బి. నగర్ కోర్టు సమీపంలోని చట్నీస్ హోటల్ వద్దకు చేరుకోగానే ఎదురుగా నుంచి రిజిస్ట్రేషన్ నంబర్ టి జి -08-టి-1473 కలిగిన సిట్రోయెన్ ఎలక్ట్రిక్ కారు వచ్చింది. హేమంత్ అనే వ్యక్తి నడుపుతున్న సదరు కారు రోడ్డుకు తప్పు వైపున అత్యంత వేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రమాదంలో తౌఫిక్ ఉద్దీన్ తీవ్రంగా గాయపడి సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున్న సయ్యద్ అయాన్ కూడా తీవ్రంగా గాయపడగా, అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై సమాచారం అందడంతో కుటుంబ సభ్యులు ఉస్మానియా ఆసుపత్రికి చేరుకున్నారు. తౌఫిక్ ఉద్దీన్ సోదరుడు సయ్యద్ ఆసిఫ్ ఉద్దీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు క్రైం నంబర్ 1063/2026 గా కేసు నమోదు చేశారు. బి ఎన్ ఎస్ సెక్షన్లు 106(1), 125(ఏ)కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకునే దిశగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

# వివాహ వార్షికోత్సవం సందర్భంగా అనాథాశ్రమంలో అల్పాహార పంపిణీ

**300 మంది పేద, అనాథ పిల్లలకు అల్పాహారం అందించిన కృష్ణ గోపాల్ సేవా సమితి**



**క్రైమ్ మిర్రర్,ఎల్బీనగర్, ఆగస్టు 10:** కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో యూకే లండన్ నివాసులు కె. శ్రీనివాస్ రెడ్డి, మమతా రెడ్డి దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం అనాథాశ్రమంలోని పేద పిల్లలకు అల్పాహార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది పిల్లలు పాల్గొని ఆనందంగా అల్పాహారం స్వీకరించారు. అనంతరం శ్రీనివాస్ రెడ్డి, శ్రీమతి మమతా రెడ్డి దంపతులకు పిల్లలు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కృష్ణ గోపాల్ సేవా సమితి అధ్యక్షులు డాక్టర్ కపిల్ కుమార్ అగర్వాల్ సమితి అధికారులతో కలిసి శ్రీనివాస్ రెడ్డి, మమతా రెడ్డి దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి పిల్లలతో కలిసి వేడుకను నిర్వహించారు. శుభ సందర్భాలను సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవడం ద్వారా పేద, అనాథ పిల్లల ముఖాల్లో చిరునవ్వులు తీసుకురావడమే కృష్ణ గోపాల్ సేవా సమితి ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. సమాజంలో సేవాభావాన్ని పెంపొందిస్తూ, అవసరమైన వారికి అండగా నిలిచేందుకు సమితి నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహించాలనుకునే దాతలు, సేవాభిమానులు కృష్ణ గోపాల్ సేవా సమితిని సంప్రదించవచ్చు. సంప్రదించండి: 8106876999

# ఊపిరితిత్తుల చికిత్సకు రూ.2.60 లక్షల ఎల్ఓసీ అందజేసిన ఎం ఎల్ ఏ దేవిరెడ్డి



**క్రైమ్ మిర్రర్,ఎల్బీనగర్, ఆగస్టు 10:** బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎస్.కె.డి. నగర్ లో నివాసం ఉంటున్న ప్రసాద్ ఊపిరితిత్తులకు సంబంధించిన పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో, ఆయన కుటుంబ సభ్యులు ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని సంప్రదించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ప్రసాద్ చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా దరఖాస్తు చేయించారు. ఈ దరఖాస్తుకు స్పందనగా రూ.2,60,000 విలువైన ఎల్ఓసీ మంజూరైంది. మంజూరైన చెక్కును బాధితుడి భార్య ధనలక్ష్మికి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, పేద ప్రజలకు సేవ చేయడం తనకు ఎంతో సంతృప్తినిస్తుందని తెలిపారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో అనేక మంది పేద కుటుంబాలకు అండగా నిలిచి సహాయం చేసే అవకాశం లభించిందని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న పేదలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని అన్నారు. అనంతరం బాధితుడి భార్య ధనలక్ష్మి మాట్లాడుతూ, తమ భర్త ఆరోగ్య సమస్యను తెలుసుకున్న వెంటనే సుధీర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. చికిత్స కోసం చెక్కు అందించడంలో ఆయన చూపిన మద్దతును జీవితాంతం మరువలేమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు చెన్నగోని శ్రీధర్ గౌడ్, పండల రాజశేఖర్, మంద రాజశేఖర్ రెడ్డి, నితీష్ తదితరులు పాల్గొన్నారు.

# షాబాద్‌లో ప్రమాదాలకు నిలయంగా మారిన కాంక్రీట్ కంపెనీలు!

**రోడ్డుపై లారీలు.. పేరుకుపోతున్న మట్టి, కంకర -- వాహనదారులకు తప్పని ఇబ్బందులు**

**ప్రమాదం జరిగే వరకు అధికారులు స్పందించరా? స్థానికుల ఆగ్రహం**



**క్రైమ్ మిర్రర్ షాబాద్:** రంగారెడ్డి జిల్లా షాబాద్: షాబాద్ మండల పరిధిలోని కాంక్రీట్ కంపెనీల నిర్వహణ తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మల్లారెడ్డిగూడ రెవెన్యూ పరిధిలోని కాంక్రీట్ కంపెనీలకు చెందిన భారీ లారీలను రోడ్డుపైనే నిలిపివేయడంతో పాటు, కంపెనీల నుంచి వెలువడుతున్న దుమ్ము, మట్టి, కంకర రోడ్డుపై పేరుకుపోతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**రోడ్డుపై కంకర.. ప్రమాదాలకు కారణమవుతుందా?**

బెంగళూరు--ముంబై లింక్ హైవే సమీపంలో ఉన్న కాంక్రీట్ కంపెనీల నుంచి లారీల రాకపోకల కారణంగా రోడ్డుపై మట్టి, కంకర పేరుకుపోతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించేటప్పుడు కంకరపై వాహనాలు అదుపుతప్పి స్కిడ్ అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**రోడ్డుపైనే భారీ లారీల పార్కింగ్**

కంపెనీలకు చెందిన భారీ వాహనాలను రోడ్డుపైనే నిలిపివేయడంతో ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని స్థానికులు అంటున్నారు. రాత్రి వేళల్లో ప్రమాదాల ముప్పు మరింత ఎక్కువగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వర్షం పడితే మరింత అధ్వానం**

వర్షాలు కురిసే సమయంలో లారీల రాకపోకలతో రోడ్డుపై మట్టి, బురద పేరుకుపోయి రహదారి దెబ్బతింటోందని స్థానికులు చెబుతున్నారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

**ప్రమాదం జరిగితేనే అధికారులు స్పందిస్తారా?**

కాంక్రీట్ కంపెనీలు రావడం అభివృద్ధికి, ఉపాధి అవకాశాలకు మంచిదేనని, అయితే కంపెనీల నిర్వహణలో నిబంధనలు పాటించాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. రోడ్డుపైకి దుమ్ము, మట్టి, కంకర రాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు భారీ లారీలను రోడ్డుపై పార్కింగ్ చేయకుండా చూడాలని కోరుతున్నారు. నిత్యం ఈ మార్గంలో అధికారులు, ప్రజాప్రతినిధులు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ రోడ్డుపై పేరుకుపోయిన మట్టి, కంకర ఎందుకు కనిపించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించే పరిస్థితి కాకుండా ముందుగానే అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే కాంక్రీట్ కంపెనీలను పరిశీలించి, రహదారిపై దుమ్ము, మట్టి, కంకర పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు స్పందించకపోతే వివిధ సంఘాలు, విద్యార్థి సంఘాలను కలుపుకొని ఆందోళన, ధర్నా చేపడతామని స్థానికులు తెలుపుతున్నారు.

# కేంద్రం ప్రజా వ్యతిరేక విధానాలు ఉపసంహరించుకునే వరకు పోరాటం

**సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కల్వకుర్తి మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఆగస్టు 10న చేపట్టిన జైలుభరో కార్యక్రమంలో భాగంగా శివాజీ చౌక్ నుంచి మహబూబ్‌నగర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నాయకులు, కార్మికులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మహబూబ్‌నగర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించడంతో సుమారు అరగంట పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ.. కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే విజిపి రాంజీ పథకాన్ని రద్దు చేసి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథాతథంగా అమలు చేయాలని కోరారు. నూతన విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, రైతులకు నష్టం కలిగించే అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేసి రైతులకు పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకునే వరకు పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు శివరాం, బాలయ్య, భవన నిర్మాణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింత ఆంజనేయులు, ఉపాధ్యక్షులు చిలుక బాల్రెడ్డి,





జిల్లా నాయకులు మల్లారెడ్డి, కృష్ణారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి. బాలస్వామి, సిఐటియు అనుబంధ సంఘాల నాయకులు శోభావతి, మహేష్, రాజు, స్వప్న, అలివేలు తదితరులు పాల్గొన్నారు. అలాగే కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి పరశురాములు, జిల్లా స్టడీ సర్కిల్ కన్వీనర్ ఏపీ మల్లయ్య, బ్రహ్మం, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు వెంకటయ్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం.. ట్రాక్టర్లు పట్టివేత

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** కల్వకుర్తి మండల పరిధిలోని గుండూరు గ్రామ శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లపై పోలీసులు చర్యలు చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున గుండూరు గ్రామ శివారు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి, ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణాపై నిఘా కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# కానిస్టేబుల్ నాగరాజు,కు హెడ్ కానిస్టేబుల్ గా పదోన్నతి

**అభినందించిన ఎస్ఐ వెంకటేష్ గౌడ్**

**వనపర్తి ఆగస్టు10 క్రైమ్ మిర్రర్ :** తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖలో భాగంగా వనపర్తి జిల్లా పెబ్బేరు పోలీస్ స్టేషన్ లో మూడు సంవత్సరాలుగా కానిస్టేబుల్ గా విధులు నిర్వర్తిస్తున్న నాగరాజు హెడ్ కానిస్టేబుల్ హోదాకు పదోన్నతి పొందారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నిర్వహించిన పదోన్నతుల ప్రక్రియలో కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహించిన కానిస్టేబుల్ నాగరాజు హెడ్ కానిస్టేబుల్ గా ప్రమోషన్ లభించింది.చాలా కాలంగా పదోన్నతి కోసం ఎదురుచూస్తున్న సిబ్బందికి ఈ అవకాశం రావడంతో పోలీసు సిబ్బందిలో ఆనందం నెలకొంది. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన నాగరాజును పెబ్బేరు ఎస్ఐ వెంకటేష్ గౌడ్ అభినందించి, వారి భవిష్యత్ సేవల్లో మరింత బాధ్యతాయుతంగా పనిచేసి శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.హెడ్ కానిస్టేబుల్ గా ప్రమోషన్ రావడం మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు విధుల నిర్వాహణలో ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగుతానని ఆయన తెలియజేశారు ఈ సందర్భంగా సోమవారం రోజున పెబ్బేరు పోలీస్ స్టేషన్ లో పోలీస్ సిబ్బంది ఆయన కి ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్ రెడ్డి, ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



## స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం అందించిఅండగా నిలిచిన మిత్రులు



**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, ఆగస్టు 10(క్రైమ్ మిర్రర్):** వలిగొండ మండల పరిధిలోని అరూర్ గ్రామానికి చెందిన బత్తిని వెంకటేష్ తల్లి బత్తిని అంజమ్మ అనారోగ్యంతో ఇటీవల మరణించగా సోమవారం తోటి మిత్రులు వెంకటేష్ కుటుంబాన్ని పరామర్శించి 11 వేల రూపాయలు అర్థిక సాయం అందజేశారు.అలాగే రిటైర్డ్ అయిన పోస్ట్ మాన్ ఎండి సుల్తాన్ 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తోటి మిత్రులు అంబాల రమేష్, ఎండి రంజాన్, వెలిమినేటి వెంకటేశం,వెలిమినేటి సంతోష్, కుమార్ వెలిమినేటి అశోక్, కుమార్, వెలిమినేటి మచ్చ గిరి మాటూరి శ్రీకాంత్,మెదుగుల నరేష్ ,ఎండి సుల్తాన్, బోగారం అంజయ్య, బత్తిని కర్ణ గౌడ్, బత్తిని యశ్వంత్ గౌడ్, బత్తిని సతీష్ గౌడ్ ఆర్థిక సాయం అందజేశారు.

## డ్రైనేజీ పనులు వేగవంతం చేయాలి: చైర్‌పర్సన్ సంధ్యారాణి

**రామకృష్ణాపూర్ ఆగస్టు 10 (క్రైమ్ మిర్రర్):** రాజీవ్‌చౌక్‌లో జరుగుతున్న డ్రైనేజీ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ సంధ్యారాణి రాజారమేష్ సోమవారం పరిశీలించారు. పనుల వల్ల వ్యాపారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని, వారికి అసౌకర్యం కలగకుండా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు.డ్రైనేజీ పనులను త్వరగా పూర్తి చేయాలని ఏఈ అశృత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అవినాష్‌ను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా వేగం పెంచాలని సూపర్‌వైజర్‌కు సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో డ్రైనేజీ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తన ఛాంబర్‌లో తెలియజేయవచ్చని, ప్రతిరోజూ కార్యాలయంలో అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.బీఆర్ఎస్ చెన్నూరు నియోజకవర్గ నాయకుడు డాక్టర్ రాజారమేష్ మాట్లాడుతూ ప్రజలకు బీఆర్ఎస్, సీపీఐ నాయకులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రామిడి ఉమ, నాయకులు రామిడి కుమార్, లక్ష్మీకాంత్, రాజీవ్‌చౌక్ వర్తక సంఘం అధ్యక్షుడు రాజు, ఇరవెన రవి, సంధి సదయ్య, అరుణ్‌రిషి, కరుణాకర్, ఏఈ అశృత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



# క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్పొరేట్ పెట్టుబడిదారులకు, మతోన్మాదులకు వ్యతిరేకంగా, మోడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండమడుగు నర్సింహ్మ

**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, ఆగష్టు 10(క్రైమ్ మిర్రర్):** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, విబిజి గ్రామ్ జి చట్టాన్ని రద్దుచేసి ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని, విద్యుత్ సవరణ బిల్లు, విత్తన సవరణ చట్టాన్ని రద్దు చేయాలని, ఆహార భద్రత చట్ట సవరణను విరమించుకోవాలని, కనీస వేతనం రూ 26 వేలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండమడుగు నర్సింహ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కేంద్ర ప్రభుత్వం విధానాలపైన జైల్ బరో కార్యక్రమం సందర్భంగా పోచంపల్లి పట్టణంలో సిఐటియు , తెలంగాణ రైతు సంఘం , తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘాల భువనగిరి చౌరస్తాలో " రాస్తారోకో " కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహ పాల్గొని మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లెబర్ కోడ్‌లను కార్మికులకు ఉద్యోగ భద్రత ఉండదని, యూనియన్ పెట్టుకోవడానికి అవకాశం లేకుండా పోతుందని అన్నారు. ఉద్యోగులను తొలగించడం, సమ్మె హక్కుపై ఆంక్షలు విధించడం, 8 గంటల పనిని 12 గంటల వరకు పెంచుకునేందుకు కంపెనీలకు ఈ కోడ్‌లు వెసులుబాటు కల్పిస్తున్నాయని తక్షణం రద్దు చేయాలని అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కొత్తగా తీసుకువచ్చిన విబిజి గ్రామ్ జి చట్టం వల్ల గ్రామీణ వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున నష్టపోతున్నారని తెలిపారు. గత పథకంలో అన్-స్కిల్డ్ కూలీల వేతనాల ఖర్చును 100% కేంద్ర ప్రభుత్వమే భరించేది. కానీ కొత్త చట్టంలో నిధుల కేటాయింపు 60 శాతం, రాష్ట్రాలు 40 శాతం నిష్పత్తికి మార్చారని దీనివల్ల రాష్ట్రాల మీద అప్పుల భారం పడి ఉపాధిని బంద్ చేయాలని పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఈ కొత్త చట్టం ఉపాధి కల్పనలో భారీ తగ్గుదల ఉంటుందని అమలు చేసిన మొదటి నెలలోనే గ్రామీణ ఉపాధి కల్పన దేశవ్యాప్తంగా దాదాపు 50 శాతం తగ్గిందని విమర్శించారు. ఏడాదికి 60 రోజుల పాటు ఉపాధి పనులను నిలిపివేస సొంత భూమి లేని నిరుపేద కూలీలు, మహిళా



కార్మికులకు వ్యవసాయ పనులు దొరకని రోజుల్లో తీవ్ర జీవనోపాధి సంక్షోభం ఎదురవుతోందని ఇప్పటికైనా వివిజి గ్రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, రైతులందరికీ పూర్తి వ్యవసాయ రుణాల మాఫీ ప్రకటించాలని, విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే ప్రయత్నాలను (ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును) ఆపాలని, కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే ప్రతిపాదిత నూతన విత్తన చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసినారు. వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే అమెరికా తదితర దేశాలతో జరుగుతున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని కోరారు. జాతీయ ఆహార భద్రత చట్ట సవరణను క్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మోడీ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు తిరగబడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి , రైతు సంఘం మాజీ డివిజన్ కార్యదర్శి గూడూరు అంజిరెడ్డి , సిఐటియు మండల కన్వీనర్ మంచాల మధు , పట్టణ కన్వీనర్ వడ్డేపల్లి యాదగిరి , తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్ష , కార్యదర్శులు పగిళ్ల లింగారెడ్డి , గూడూరు బుచ్చిరెడ్డి , తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష , కార్యదర్శులు బొడ్డు కిషన్, ప్రసాదం విష్ణు పాల్గొని మాట్లాడగా మూడు సంఘాల బాధ్యులు అందెల జ్యోతి, గూడూరు రాంరెడ్డి, పత్తి బిక్షపతి, వారాల మల్లారెడ్డి, బాబు, ఉపేందర్, శంకర్, స్వామి, సలీం, లింగస్వామి, అరుణ, జయమ్మ, శారద, మనీలా, పద్మ, వసంత, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ డెలివరీలో అదనపు వసూళ్లు.. అధికారుల మౌనం!

- వినియోగదారుల ఫిర్యాదులు పట్టించుకోని సంబంధిత అధికారులు?
- నిర్దేశిత ధర కంటే అదనంగా వసూలు చేస్తున్నారంటూ ఆరోపణలు

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో గ్యాస్ సిలిండర్ డెలివరీ వ్యవహారంపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సిలిండర్ ధరకు అదనంగా డెలివరీ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని పలువురు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. గ్యాస్ బుకింగ్ సమయంలో చెల్లించిన మొత్తానికి అదనంగా ఇంటి వద్ద సిలిండర్ డెలివరీ చేసే సమయంలో డబ్బులు అడుగుతున్నారని వినియోగదారులు పేర్కొంటున్నారు. దీనిపై ప్రశ్నించినా సరైన సమాధానం ఇవ్వడం లేదని, సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కనిపించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదులు ఉన్నా.. చర్యలు ఏవి? గ్యాస్ డెలివరీలో అదనపు వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు అధికారులు స్పందించకపోవడంపై వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నప్పుడు అధికారులు ఎందుకు స్పందించడం లేదు? అదనపు వసూళ్లపై విచారణకు ఎందుకు ఆదేశాలు ఇవ్వడం లేదు? వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్న అదనపు మొత్తాలకు బాధ్యత ఎవరిది? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధికారుల స్పందన కోసం ఎదురుచూపులు గ్యాస్ డెలివరీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని వినియోగదారులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అదనపు వసూళ్లు జరుగుతున్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోవాల్సిన అధికారులు.. ఫిర్యాదులు వచ్చినా మౌనం వహించడం ఎందుకు? ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి గ్యాస్ డెలివరీలో జరుగుతున్న అదనపు వసూళ్లపై విచారణ చేపడతారా? అనేది వేచి చూడాలి.



# తెలంగాణలో 'బీసీ లెజిస్లేటివ్ కమిటీ' ఏర్పాటు చేయాలి

**అన్ని పార్టీల బీసీ ప్రజాప్రతినిధులతో శాశ్వత శాసన వేదిక అవసరం: దాసు సురేశ్**

**క్రైమ్ మిర్రర్,హైదరాబాద్, ఆగస్టు 10:** పార్లమెంటరీ ఓబీసీ సంక్షేమ కమిటీ తరహాలో తెలంగాణ శాసనసభ, శాసనమండలిలోని బీసీ ప్రజాప్రతినిధులతో ప్రత్యేకంగా బీసీ లెజిస్లేటివ్ కమిటీ ఏర్పాటు చేయాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని, శాసనసభ స్పీకర్‌ను కోరారు.బీసీల సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ, రిజర్వేషన్లు, సంక్షేమం తదితర అంశాలపై నిరంతర అధ్యయనం, ప్రభుత్వ విధానాల పర్యవేక్షణ, శాఖల జవాబుదారీతనం, సమగ్ర విధాన రూపకల్పన కోసం ప్రత్యేక కమిటీ అవసరమని ఆయన పేర్కొన్నారు.ఇటీవల బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో బీసీ మహనీయుల విగ్రహాల ఏర్పాటు, బీసీలకు సంబంధించిన కీలక అంశాలపై పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో నిర్వహించిన సమావేశాన్ని దాసు సురేశ్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన బీసీ ప్రజాప్రతినిధులు పార్టీ భేదాలకు అతీతంగా ఏకమై బీసీ లెజిస్లేటివ్ కమిటీ ఏర్పాటుకు చొరవ చూపాలని కోరారు.బీసీలు జనాభా పరంగా గణనీయమైన సంఖ్యలో ఉన్నప్పటికీ, వారి సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు లభించడంలో ఇంకా జాప్యం జరుగుతోందని దాసు సురేశ్ అన్నారు. బీసీల సమస్యలు కేవలం బీసీ సంక్షేమ శాఖకే పరిమితం కావని, విద్య, ఉద్యోగాలు, వ్యవసాయం, కులవృత్తులు, పారిశ్రామికాభివృద్ధి, మహిళా సాధికారత, ఆర్థికాభివృద్ధి, రిజర్వేషన్లు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అనేక రంగాలతో ముడిపడి ఉన్నాయని తెలిపారు.

### విస్తృత అధికారాలతో కమిటీ

ప్రతిపాదిత బీసీ లెజిస్లేటివ్ కమిటీకి కేవలం సలహా పాత్ర కాకుండా విస్తృత అధికారాలు కల్పించాలని దాసు సురేశ్ సూచించారు. ప్రభుత్వ శాఖల నుంచి సమాచారం కోరడం, సంక్షేమ పథకాల అమలును సమీక్షించడం, క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించడం, నిపుణులు, బీసీ సంఘాల అభిప్రాయాలను స్వీకరించడం, అధ్యయనాలు చేపట్టడం, శాసనసభకు నివేదికలు, సిఫారసులు సమర్పించే అవకాశం ఉండాలని అన్నారు. బీసీల జనాభా, రిజర్వేషన్ల అమలు, ప్రభుత్వ నిధులు--పథకాలు, లబ్ధిదారులు, విద్య--ఉద్యోగ అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం తదితర అంశాలపై శాస్త్రీయ అధ్యయనం చేసేందుకు ప్రత్యేక పరిశోధనా విభాగం,




డేటా విశ్లేషణ నిపుణులు, అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరారు.

### అన్ని పార్టీలకు ప్రాతినిధ్యం

బీసీ లెజిస్లేటివ్ కమిటీలో అధికార, ప్రతిపక్షాలతో పాటు శాసనసభలో ప్రాతినిధ్యం ఉన్న అన్ని రాజకీయ పార్టీల బీసీ ప్రజాప్రతినిధులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని దాసు సురేశ్ అన్నారు. స్థానిక సంస్థలు, శాసనసభ, శాసనమండలి, నామినేటెడ్ పదవులు, కార్పొరేషన్లు, కమిషన్లు, బోర్డుల్లో బీసీలకు లభిస్తున్న ప్రాతినిధ్యంపై సమగ్ర డేటాను సేకరించి, అవసరమైన విధానపరమైన సిఫారసులు చేయాలని సూచించారు. బీసీ మహిళల రాజకీయ ప్రాతినిధ్యం, సబ్‌కోటా, బడ్జెట్‌లో తగిన భాగస్వామ్యం, విద్యార్థుల సంక్షేమం, ఉద్యోగుల పదోన్నతులు, కులవృత్తుల అభివృద్ధి, ఆర్థిక స్వావలంబన, మార్కెటింగ్ సదుపాయాలు, విద్య--ఉద్యోగ అవకాశాలు, రాజకీయ రిజర్వేషన్లు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై సమగ్ర విధాన చర్చ అవసరమని ఆయన పేర్కొన్నారు. "బీసీల సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలు కాకుండా శాశ్వత విధానపరమైన పరిష్కారాలు రావాలంటే శాసనసభలోనే బీసీల సమస్యలను నిరంతరం అధ్యయనం చేసి, పర్యవేక్షించే వ్యవస్థ అవసరం. బీసీ లెజిస్లేటివ్ కమిటీ ఆ దిశగా కీలకమైన ముందడుగు అవుతుంది" అని దాసు సురేశ్ అన్నారు. కమిటీ ఏర్పాటు ఆవశ్యకతపై త్వరలో హైదరాబాద్‌లో బీసీ ప్రజాప్రతినిధులు, మేధావులు, ఉద్యమ నాయకులు, వివిధ బీసీ సంఘాల ప్రతినిధులతో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.



## ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగురవేయాలి..!

**క్రైమ్ మిర్రర్ :కొందుర్గు :-** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కొందుర్గు మండలంలో "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. మండల కేంద్రంలో మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కక్కునూరు వెంకటేష్ గుప్తా ముఖ్యఅతిథిగా హాజరై. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి భారతీయుడిలో దేశభక్తి, జాతీయ ఐక్యత, సమైక్యతా భావాన్ని మరింత బలోపేతం చేయడమే "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అన్నారు. "ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగరాలి... ప్రతి గుండెలో భారతదేశం నిలవాలి. జాతీయ జెండా మన గౌరవానికి, మన ఐక్యతకు ప్రతీక. ప్రతి కార్యకర్త తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి" అని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో మువ్వన్నెల జెండాతో కళకళలాడేలా కార్యకర్తలు ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హర్ ఘర్ తిరంగా మండల కన్వీనర్ కొమరబండ శ్రీశైలం, కో కన్వీనర్ కార్తిక యాదవ్, సీనియర్ నాయకులు గుండేటి శివారెడ్డి, సున్నాల అంజయ్య, కారుకొండ సుధాకర్, లొద్దిల శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి చందు ముదిరాజ్, రఘునాథ్ రెడ్డి, గోపి నర్సింలు, గాలి శివకుమార్, శ్రీనివాస్, వెంకటేష్, గిరి కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# నార్సింగి సర్కిల్ పరిధిలోని వట్టినాగులపల్లిలో రోడ్ల దుస్థితి

**అధ్వానంగా మారిన రహదారులు...**

**రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్**

**వర్షాలకు మరింత దెబ్బతిన్న రోడ్లు... ప్రయాణికులు, విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు**

**గండిపేట్,(క్రైమ్ మిర్రర్):** నార్సింగి సర్కిల్ పరిధిలోని వట్టినాగులపల్లిలో రోడ్ల దుస్థితి రోజురోజుకూ అధ్వానంగా మారుతోంది. ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు దెబ్బతినడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాల రద్దీ పెరగడంతో సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోతున్న పరిస్థితి నెలకొంటోందని స్థానికులు చెబుతున్నారు. ఐటీ కారిడార్‌కు సమీపంలో వట్టినాగులపల్లి ఉండటంతో ఈ ప్రాంతం మీదుగా రాకపోకలు సాగించే వాహనాల సంఖ్య గత కొంతకాలంగా గణనీయంగా పెరిగిందని స్థానికులు తెలిపారు. తెల్లాపూర్, గోపన్‌పల్లి తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండటంతో కొంతమంది వాహనదారులు గౌలిదొడ్డి వైపు వెళ్లకుండా వట్టినాగులపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో ఇప్పటికే పరిమితంగా ఉన్న రహదారిపై వాహనాల ఒత్తిడి మరింత పెరిగిందని తెలిపారు.

### వర్షాలతో మరింత అధ్వానంగా...

ఇటీవల కురిసిన వర్షాలతో వట్టినాగులపల్లి రహదారుల పరిస్థితి మరింత దారుణంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై గుంతలు ఏర్పడటంతో పాటు వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు గుంతలను తప్పించుకుంటూ నెమ్మదిగా ప్రయాణించాల్సి వస్తోందన్నారు. కొన్ని ప్రాంతాల్లో రోడ్డు ఎక్కడ ఉందో, గుంతలు ఎక్కడ ఉన్నాయో గుర్తించడం కూడా కష్టంగా మారిందని చెబుతున్నారు. వర్షం కురిసిన ప్రతిసారీ రహదారులపై నీరు నిలిచిపోవడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రోడ్డు పక్కన సరైన నీటి పారుదల వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు రహదారిపైనే నిలిచిపోతుందని స్థానికులు అంటున్నారు. దీంతో రహదారులు త్వరగా దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు.

### విద్యార్థులు, ఉద్యోగులకు నిత్య ఇబ్బందులు

ప్రతిరోజూ ఉదయం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు ఉద్యోగులు కూడా ఈ రహదారులపై ప్రయాణించాల్సి వస్తోంది. ట్రాఫిక్ రద్దీ కారణంగా సమయానికి పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలకు చేరుకోలేకపోతున్నామని పలువురు వాహనదారులు, స్థానికులు పేర్కొంటున్నారు. సాయంత్రం వేళల్లో కార్యాలయాల నుంచి తిరిగి వచ్చే ఉద్యోగులు, ఇతర ప్రాంతాల నుంచి గ్రామానికి వచ్చే ప్రజలతో వాహనాల రద్దీ మరింత పెరుగుతోందని తెలిపారు. రహదారుల పరిస్థితి,వాహనాల సంఖ్యకు అనుగుణంగా లేకపోవడంతో కొద్దిదూరం ప్రయాణించడానికి కూడా ఎక్కువ సమయం పడుతోందని వాపోతున్నారు.

### అత్యవసర సేవలకు ఆటంకం తప్పదా?

ట్రాఫిక్ రద్దీ ఇదే విధంగా కొనసాగితే అత్యవసర పరిస్థితుల్లో



అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలు వంటి సేవలు కూడా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై వాహనాలు నిలిచిపోయిన సమయంలో అత్యవసర వాహనాలకు మార్గం కల్పించడం కూడా కష్టంగా మారుతోందని తెలిపారు.

### అధికారులు స్పందించాలి

వట్టినాగులపల్లి రహదారుల సమస్యపై సంబంధిత అధికారులు తక్షణమే దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. వట్టినాగులపల్లి రహదారి సమస్యను మున్సిపల్ అధికారులు, జీహెచ్ఎంసీ కమిషనర్, స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, సంబంధిత ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి తక్షణ పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజలు ప్రతిరోజూ ఎదుర్కొంటున్న సమస్యను ఇకనైనా అధికారులు తీవ్రంగా పరిగణించి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.